www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం జులై 4 2024
5
చిత్తూరు



6న సహకార దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రతి సంవత్సరం జులై 6వ తేదీన అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోంది. ఈ ఏడాది సహకారం మెరుగైన భవిష్యత్తు అనే అంశంపై 102వ సహకార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార సంస్థల అధికారి వనజ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా సహకార దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. సహకార అధికారులు నాగవర్ధన్, బ్రహ్మానంద రెడ్డి సుధాకర్లు పాల్గొన్నారు.



కుప్పం అర్జీల పరిష్కారంపై

త్వరితగతిన చర్యలు చేపట్టండి : కలెక్టర్




సీఎం కుప్పం పర్యటన ఫిర్యాదులపై అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్


ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జూన్ 25, 26వ తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో భాగంగా అందిన అర్జీల పరిష్కారంపై త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశమై అర్జీల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 25, 26వ తేదీల్లో కుప్పం పర్యటనలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన 1140 అర్జీల పరిష్కారంపై సంబంధిత శాఖలు అర్జీల వారీగా క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను సిద్ధం చేయాలన్నారు. అర్జీలలో పరిష్కరించదగ్గవి వెంటనే పరిష్కరించాలని సర్వీస్‌కు సంబంధించిన అంశాలు, ఆర్థిక సంబంధమైన అర్జీలకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదికను పంపాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన అర్జీలు అన్నింటిని ఆన్లైన్లో పొందుపరచాలని ఆధార్ నెంబరు మొబైల్ నెంబర్ లేని వారి వివరాలను సేకరించి ఆన్లైన్లో పొందుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శాఖవారీగా వారికి అందిన అర్జీలలో అర్జీకి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి అర్థవంతంగా పరిష్కరించాలన్నారు. మరో 10రోజుల తర్వాత ఇదే అంశంపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలనపై వాడి వేడి చర్చ

అన్ని శాఖల్లో అవినీతిని నిలదీసిన టిడిపి ఎమ్మెల్యేలు


మాట్లాడుతున్న జెడ్పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గత ఐదేళ్ల పాలనపై జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలో తెలుగుదేశం ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, పులివర్తి నాని, మురళీమోహన్, డాక్టర్ థామస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు అన్ని శాఖల్లోనూ అవినీతి చోటు చేసుకుందని, అభివృద్ధి ఏమాత్రం జరగలేదంటూ ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ నేతల ఒత్తిళ్లకు లోనై అధికారులు ప్రజాధనాన్ని వృధా చేయడంతో పాటు ఎక్కడ నిబంధనలు పాటించలేదన్నారు. బుధవారం జరిగిన జిల్లా పరిషత్ స్థాయి సమావేశంలో పదేపదే తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి తగిన ప్రాధాన్యతనిస్తుందని నిబంధనలు పాటించకుండా అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామంటూ అధికారుల హెచ్చరించారు. ఉదయం నుండి దాదాపు సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రభుత్వ శాఖల పనితీరుపై వాడి వేడిగా చర్చించారు. సమావేశం ప్రారంభం కాగానే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చే సూచనలు సలహాలు తీసుకొని జడ్పీ ద్వారా అభివృద్ధి పనులు చెప్పటడం జరుగుతుందని జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక జడ్పీ సమావేశం హాల్‌లో జడ్పీ సీఈఓ గ్లోరియా, జడ్పీవైస్ ఛైర్‌పర్సన్ కుమారి రమ్య, స్త్రీ శిశు సంక్షేమ జడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ భారతిలతో కలసి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ ముందుగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జిల్లాలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీ ద్వారా జిల్లాలోని 14 నియోజకవర్గాల అభివృద్ధికి మనందరం అన్నదమ్ములుగా కలసి పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లాను మొదటి స్థానంలో నింపుటకు ఎమ్మెల్యేలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ ప్రజలకు ముఖ్యమైనవి రోడ్లు, తాగునీరు, డ్రైనేజి, వీధి లైట్లుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో అన్ని పంచాయతీలలోని వాటర్ ట్యాంక్‌లు పరిశీలించి, క్లినింగ్ చేయాలన్నారు. టిట్కో గృహాలు వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ఎమ్మెల్యేలకు సలహాలు సూచనలు ఇవ్వాలని, ఎమ్మెల్యే ఇచ్చే సలహాలు సూచనలు తీసుకోన్నపుడే ప్రజలకు మంచి జరిగే అవకాశం ఉందన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్ మాట్లాడుతూ గతం ప్రభుత్వంలో జడ్పీటీసీ సభ్యులకు ఎలాంటి గౌరవం లేదని జడ్పీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకురావడం చాలా బాధ కలిగిస్తుందన్నారు. ఈ ప్రభుత్వంలో అందరికి గౌరవం ఉంటుందని ఎమ్మెల్యేలుగా మీవెంట ఉండి అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. పనులకు అంచనాలు, పనుల పురోగతి, పూర్తి అయ్యిన పనులకు సంబంధించి పూర్తి డేటా ఇవ్వాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి ఎన్టీఆర్ భరోసా పించన్లు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలో రోడ్లు మరమ్మతులు చేపట్టాలని, కొన్ని గ్రామలలో గృహాలపై విద్యుత్ లైన్లు ఉండడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, తాగునీటి సమస్యలు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని సంబందించిన అధికారులను ఆదేశించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మునిప్రసాద్ (నాని) మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామ సచివాలయలలో వ్యక్తి పేర్లు ఉన్నాయి వాటిని పరిశీలించి నివేదికను ఇవ్వాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని మండలంలో తాగునీటి సమస్య ఉందని అన్ని గ్రామాలు పరిశీలించి తాగునీటి సమస్యను పరిష్కరం చేయాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కరానికి జడ్పీ నుండి నిధుల మంజూరు చేయాలని జడ్పీ చైర్మన్, సీఈఓ చూచించారు. నియోజకవర్గంలో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, జలవనరులు, విద్యుత్, రహదారులు అండ్ భవనాలు, గృహ నిర్మాణం, శాఖ ద్వారా గత 5 సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి పూర్తి డేటా అందజేయాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వియం థామస్ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు మనందరం కలసి పనిచేసి జిల్లాను అభివృద్ధి చేద్దామన్నారు. తమకు ఎలాంటి కక్ష్య సాధింపులు ఉండవని, స్నేహపూర్వకంగా ప్రజలకు సేవచేయలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రజలకు మంచి ఆరోగ్యం అందించాలిని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఆదేశించారు. అర్హులకు పింఛన్లు, గృహాలు ఇవ్వకుండా, అనర్హులకు పింఛన్లు గృహాలు ఇవ్వడం జరిగిందని వీటిని పరిశీలించి నివేదికను అందజేయాలని, వివిధశాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలన్నారు. ఎన్టీఆర్ జలాశయం ద్వారా 33 చెరువులను అనుసంధానం చేసి నీటితో అన్ని చెరువులను నింపాలని, కృష్ణాపురం జలాశయా పూర్తి చేసి రైతులకు వ్యవసాయానికి నీరు ఇవ్వాలని జలవనరుల శాఖ ఎస్ఈని ఆదేశించారు. అధికారులు క్రమశిక్షణతో శుద్దితో పని చేసి ప్రజల నుంచి ప్రశంసలు పొందాలని అధికారులకు చూచించారు. అధికారులను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశం తమకు లేదని, ప్రజలకు మంచి జరగలన్నదే తమ ముఖ్య ఉద్దేశమని, ఎమ్మెల్యేలు అధికారులు అందరం కలిసి కట్టుగా ప్రజలకు పనిచేదామని ఎమ్మెల్యేలు జడ్పీ చైర్మన్‌కు జడ్పీటీసీ సభ్యులకు, అధికారులకు తెలియజేశారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ జిల్లాలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన గౌరవ శాసన సభ్యులను శాలువలతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, జడ్పిటిసిలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు

11 అయినా.. అధికారులేరీ..?

- ఖాళీగా ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం
- మారని అధికారుల తీరు
- పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కుప్పం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం అధికారులు పనివేళల్లో రాకుండా ఇష్టారాజ్యంగా ఎప్పుడుపడితే అప్పుడు వస్తూ ఆఫీసుకు వస్తున్నారు. దీని వలన రోజూ ఉదయం 10 గంటలకే పనులు మానుకొని గ్రామాల నుంచి వస్తున్న ఫిర్యాదుదారులు అవస్థలు పడుతున్నారు. బుధవారం ఉదయం 11 గంటల సమయం అవుతున్నా ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం అధికారులు ఒక్కరంటే ఒక్కరు కూడా రాకపోవడం దారుణం. తమ సమస్యల పరిష్కారం కోసం ఆఫీసులకు వచ్చి వేస్తున్నా.. అధికారులు మాత్రం విధినిర్వహణలో అలసత్వం వహించడం దారుణమని, దీనిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రతిరోజు జరుగుతున్న తంతు అని, గతంలో అంగన్వాడీలు రాష్ట్ర సమ్మెలో భాగంగా 42 రోజులు కుప్పంలో ప్రాజెక్టు కార్యాలయం వద్ద శిబిరం వేసుకునే ఆందోళన వ్యక్తం చేస్తే 42 రోజుల కాలంలో ఒక్కరోజు కూడా సిడిపిఓ కార్యాలయానికి రాలేదని గుర్తు చేశారు. ఇవన్నీ ప్రత్యక్షంగా రోజు జరుగుతున్న జిల్లా ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీనిని బట్టి చూస్తే జిల్లా అధికారులకు సిడిపిఓకు మధ్య ఉన్న బంధం అనుమానాలకు దారితీస్తున్నదన్నారు. సమస్యలపై అధికారులను కలవడానికి ఎప్పుడైనా కార్యాలయానికి వెళితే ఎప్పుడూ ఉండని పరిస్థితి అన్నారు. సమస్యలపై వినతిపత్రాలు ఇస్తే మేము తీసుకోము పోస్ట్‌లో పంపించండని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, ఇలాంటి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



క్వారీలలో తనిఖీలు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మైనింగ్ అధికారులు, తహశీల్దార్ ఆల్ఫ్రెడ్ ధోనితో కలిసి గత రెండు రోజులుగా మండలంలోని క్వారీలను తనిఖీ చేసినట్లు తెలిపారు. మండలంలోని కటికపల్లి గ్రామపంచాయతీకి సంబంధించి మైనింగ్‌పై జిల్లా మైనింగ్ సర్వే నారాయణ, తహశీల్దార్‌తో కలిసి 11 క్వారీలలో తనిఖీ చేయగా అందులో 7 క్వారీలలో పనులు నిలిపి మూసివేయడం జరిగిందన్నారు. మిగిలిన నాలుగు చోట్ల క్వారీలలో తనిఖీలు జరుగుతున్నాయని, క్వారీలలో రికార్డులను పరిశీలించామన్నారు. అలాగే అన్ని క్వారీల రికార్డులను జిల్లా స్థాయి అధికారులకు పంపడం జరిగిందని నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


క్వారీలలో తనిఖీ చేస్తున్న జిల్లా మైనింగ్ సర్వే నారాయణ, తహశీల్దార్ ఆల్ఫ్రెడ్ ధోని

రైతుకు రూ.35వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అగ్ని ప్రమాదంలో పంట నష్టపోయిన రైతు జగన్నాథ నాయుడుకు రూ.35 వేలు ఆర్థిక సాయంను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం అందజేశారు. పెనుమూరు మండలం ఎల్లంపల్లి గ్రామంకు చెందిన రైతు జగన్నాథ నాయుడు వారి పొలంలో వేసిన నేరేడు పంటతో పాటు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు కూడా అగ్ని ప్రమాదానికి గురై మొత్తం కాలిపోవడం జరిగింది. ఈ విషయమై తనకు ఆర్థికసాయం చేయవలసిందిగా పెనుమూరు తహశీల్దార్ వారిని అభ్యర్థించగా వారు జిల్లా కలెక్టర్ వారి కార్యాలయానికి పంపడం జరిగింది. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ రైతుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద రూ.35 వేలు ఆర్థిక సాయంను అందజేశారు.


రైతుకు ఆర్థిక సాయం అందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు తోడ్పాటునందించండి

కేంద్ర మంత్రికి చిత్తూరు ఎంపీ విజ్ఞప్తి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాన్ని అన్ని రకాల అభివృద్ధి చేసేందుకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు తోడ్పాటును అందించాలని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి జితన్‌రామ్ మాంఝీకి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పార్లమెంట్ సెషన్స్‌కు హాజరైన ఎంపీ బుధవారం దేశరాజధాని ఢిల్లీలోని కేంద్ర మంత్రి జితన్‌రామ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి, చిత్తూరు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సహాయసహకారాలు అందించాలని కోరారు. జిల్లాలో ఎంఎస్ఎంఈలను స్థాపించం ద్వారా నిరుద్యోగ సమస్యకు పరిష్కారమార్గాన్ని చూపించిన వారవుతారని విన్నవించారు. చిత్తూరు పార్లమెంటుకు సంబంధించిన అనేక అంశాలను వివరించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని చిత్తూరు పార్లమెంటు అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడంతో పాటు పలు పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణ పరిస్థితులున్న నేపథ్యంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకు సహకరించాలని కేంద్ర మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలోని లెదర్ ఫ్యాక్టరీతోపాటు, నగిరి నియోజకవర్గంలో టెక్స్టైల్ పార్క్ , కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో గుజ్జు పరిశ్రమలు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణాలను చేపట్టేందుకు సహకరించాలని కోరినట్లు వివరించారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేకమందికి ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉందని, కేంద్రమంత్రికి వివరించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర మంత్రి కూడా ఇందుకు సానుకూలంగానే స్పందించారని ఆయన వెల్లడించారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ప్రగతి పథం వైపు తీసుకెళ్లడమే తన ముందున్న ఏకైక లక్ష్యమన్నారు.


కేంద్ర మంత్రి కి వినతిపత్రం ఇస్తున్న ఎంపి ప్రసాదరావు

అత్యవసర మందులు, వస్తువులు

ఆరోగ్యశ్రీ నిధుల నుంచి కొనుగోలు చేయండి..


పలమనేరు ప్రాంతీయ వైద్యశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులోని ప్రాంతీయ వైద్యశాలను బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ డిసిహెచ్ఎస్ రాజశేఖర్ రెడ్డితో కలసి ఆకస్మిక తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాంతీయ వైద్యశాలకు అవసరమైన ల్యాబ్ రీఏజెంట్స్, అత్యవసర మందులు, వస్తువులను ఆరోగ్యశ్రీ నిధుల నుంచి కొనుగోలు చేయాలన్నారు. అలాగే డిప్యుటేషన్‌పై వెళ్ళిన వైద్య సిబ్బందిని వెనక్కు తీసుకురావాలని ఆదేశించారు. నవజాత శిశువులకు అవసరమగు వార్మర్స్ కొనుగోలు చేయుటకు, ఆపరేషన్ థియేటర్‌లో అవసరమైన బాయిల్స్ ఆపరేటర్స్ కొనుగోలుకు కలెక్టర్ నిధుల నుండి రూ.2లక్షలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఉండాలని సూచించారు. వైద్యశాల ఆవరణలో పారిశుద్ధ్యం, ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చిన్నపిల్లల డాక్టర్, ఎముకల డాక్టర్, చర్మవ్యాధి నిపుణులు, జనరల్ ఫిజీషియన్, రేడియాలజిస్ట్‌ల కొరత విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మమతారాణి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశంను పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు.

పట్టుగూళ్ల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు చేపట్టండి

బుధవారం పలమనేరులోని పట్టుగూళ్ల ఉత్పత్తి కేంద్రంను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రైతులు, రీలర్లతో చర్చించి పట్టుగూళ్ల ఉత్పత్తి ప్రక్రియను, పట్టుదారాల ధరలను అడిగి తెలుసుకున్నారు. పట్టుగూళ్ల ఉత్పత్తి పెంచుటకు అవసరమైన సదుపాయాలను రైతులు, రీలర్‌లను అడిగారు. పట్టుగూళ్ళ దిగుబడి పెంచుటకు అవసరమైన చర్యలు చేపట్టాలని పట్టుపరిశ్రమ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమలశాఖ జేడి శోభారాణి, ఏడి కిషోర్ నాయక్, గ్రైనేజ్ ఇంచార్జ్ నగేష్, పట్టు గూళ్ళ విక్రయకేంద్ర అధికారి అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు జిల్లాలోని అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది సంవత్సరాలు అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యాశాఖ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయం, డివైయి కార్యాలయాలను సంప్రదించాలని పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీ ఎన్జీవో నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమిత్ కుమార్‌ను ఏపీ ఎన్జీవో జిల్లా నాయకులు బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఈహెచ్ఎస్ ఉద్యోగులు సమీపంలోని వేలూరు సీఎంసీలో వైద్యసౌకర్యం పొందేలా చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. జేఏసీ నాయకుల విజ్ఞప్తిపై పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు రాఘువులు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేష్, నాయకులు ప్రతాప్, పయని, శేఖర్, యశ్వంత్‌లు పాల్గొన్నారు.



చినుకు పడితే.. రోడ్లపైనే మురుగు

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం పెద్ద ఉప్పరపల్లిలో చినుకు పడితే మురుగు నీరు అంతా రోడ్లపై వచ్చి పాదాచారులకు వాహన చోదకులకు ఇబ్బందిగా మారుతుంది. పెద్దమసీదు వద్ద మురుగునీటి కాలువలు చెత్త చెదారంతో నిండిపోవడంతో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి వర్షపు నీటితో కలసి మురుగునీరు కూడా రోడ్డుపై ప్రవాహంలా సాగుతూ రోడ్డు మొత్తం మురుగు నీటితో నిండిపోయింది. మురుగునీటి కాలువలను నిత్యం పూడుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తూ వస్తే ఈ సమస్య ఉండేది కాదని ప్రజలు అంటున్నారు. మురుగునీటి కాలువలను పూర్తిస్థాయిలో పూడిక తీయుట చేసి మురుగునీరు కాలువలలో సజావుగా పారే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పెద్ద మసీదు వీధిలో రోడ్డుపై మురుగునీరు

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండల పరిధిలోని తులసమ్మ గుడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురుశిష్య సేవాసంఘం పలమనేరు వారి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సొంతంగా వనరులను సమకూర్చుకోవడంలో సమర్ధతను పెంచుకోవాలని అందుకు విద్య ఎంతో తోడ్పాటు ఇస్తుందని తెలియజేశారు. సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు మాట్లాడుతూ సేవా గుణాన్ని ప్రతి ఒక్క విద్యార్థి అలవర్చుకోవాలని అందుకు అవసరమైన విధంగా మార్గదర్శకత్వాన్ని ఉపాధ్యాయుల దగ్గర నుంచి నేర్చుకోవాలని సూచించారు. సంఘం సభ్యులు తులసమ్మ గుడి పాఠశాలకు అవసరమైన మొక్కలను తమ సేవా సంఘం తరపున అందిస్తామన్నారు. సంఘం కార్యదర్శి వీరభద్ర గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి ప్రసాద్, ఉపాధ్యాయులు వినాయక పాల్గొన్నారు.

చిత్తూరు డెస్క్: మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో బాలమురుగన్ స్టోర్స్ యజమాని రాధాకృష్ణ విద్యార్థులకు అభ్యసనా సామగ్రిని వితరణగా అందించారు. బుధవారం పాఠశాలకు వెళ్లిన ఆయన ఎంఈవో నమశ్శివాయం ద్వారా విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దాతను అభినందించారు. దాత సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యాపరంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కవిత, పీసీ చైర్మన్ వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రామకుప్పం: మండల కేంద్రంలోని బాలుర, అంబేద్కర్ గురుకుల, గడ్డురు పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు తదితర విద్యాసామాగ్రిని టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, రాష్ట్ర నేత మునస్వామి అందించారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మంచి విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు. అమ్మకు వందనం పథకం ద్వారా 15 వేల రూపాయలను అందిస్తారన్నారు. పాఠశాలలో మరింత మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నరసింహులు, ఆంజనేయ రెడ్డి, సీతాపతి, సుబ్రీ, రామకృష్ణప్ప పాల్గొన్నారు.



నేడు దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్

జయప్రదం చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగరిలో గురువారం నిర్వహించనున్న దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారికి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం ఐక్య విద్యార్థి సంఘంతో పాటు ఎంఈవోను కలిసిన ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ విజయ్‌కుమార్ బంద్ ఆవశ్యకతను ఎంఈవోకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఎ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. తీవ్రమైన అవకతవకలు చోటుచేసుకుందన్నారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నామన్నారు. అన్నీ విద్యా సంస్థల యాజమాన్యాల బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు బాషా, రోహిత్, కామరాజు, ముని, విశాల్, గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సచివాలయం ఉద్యోగులు

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండల ప్రజాపరిషత్ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్ పంపిణీలో భాగంగా కొందరు ఉద్యోగులు మానవత్వం చాటుకొని ప్రశంసలు అందుకున్నారు. మేలుమాయి పంచాయతీ చిన్నమనాయనపల్లికి చెందిన శ్రీరాములు తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో కేన్సర్ చికిత్స పొందుతుండగా సచివాలయం నందు పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాకేష్ తిరుపతికి వెళ్లి సదరు వ్యక్తికి పింఛన్ అందజేశారు. అలాగే వేలూరు సిఎంసి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కల్లుపల్లి గ్రామానికి చెందిన రామచంద్ర మూర్తికి వెల్ఫేర్ అసిస్టెంట్ అన్నూరు శ్రావణి ఫించన్ అందించారు. మమడుగు పంచాయతీ కంచిరెడ్డిపల్లికు చెందిన బి.శాంతమ్మ స్విమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా మహిళా పోలీస్ షణ్ముగప్రియ ఫించన్ అందజేశారు. మానవత్వం చాటుకున్న ఉద్యోగులను పలమనేరు ఏపీఎన్జీజిఓ సంఘం అధ్యక్షులు ఆనందబాబు అభినందించారు. వీరితో పాటు రికార్డుస్థాయిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేసిన మండలంలోని సచివాలయ ఉద్యోగులను గంగవరం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఈఓ పీఆర్డీ తిరుమల గోపాల ప్రసాద్ అభినందించారు.

కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని దిగువమాగం గ్రామంలో మహాభారత యజ్ఞం ఘనంగా జరిగింది. బుధవారం ద్రౌపతి పంచ పాండవుల కళ్యాణోత్సవం నిర్వహించగా ఈ కళ్యాణోత్సవంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు. దిగువమాఘం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నాయకులు ఘనస్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం ధర్మరాజుల దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం అందించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు.

విద్యాప్రమాణాలు పెంచేందుకే క్షేత్రస్థాయిలో తనిఖీలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యాప్రమాణాలు పెంచేందుకే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపడుతున్నట్లు జిల్లా జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాల సమన్వయకర్త అజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మొగిలిమిట్టూరు ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని పనిలో కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావేత్తలుగా తయారు చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రారంభిస్తున్నదని వాటి వలన విద్యాప్రమాణాలు పెంపొంది యువతి యువకులు అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం అని దీనిని గ్రామీణ ప్రాంత ప్రజలు అవగాహన చేసుకుని తమ పిల్లలను విద్యావంతులుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి నాగేశ్వర రావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెంగల్‌రెడ్డి, సిఆర్‌పి ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముని చంద్ర



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్యుత్ నియోగదారులకు మెరుగైన సదుపాయాలు కల్పించనున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిచంద్ర తెలిపారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ ముని చంద్ర మాట్లాడుతూ విద్యుత్‌శాఖ చిత్తూరు సబ్‌డివిజన్ పరిధిలోని చిత్తూరు నగరం, రూరల్ ఇతర ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రతి బుధవారం విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు. డొమెస్టిక్ కనెక్షన్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. చోరీకి గురవుతున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను త్వరగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ప్రతి బుధవారం నిర్వహించే అదాలత్తులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు పద్మనాభ పిళ్లై, శేషాద్రి రెడ్డి వివిధ ప్రాంతాల ఏఈలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎన్నారై విక్రమ్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఎన్‌ఆర్ఐ విక్రమ్ బుధవారం అమరావతిలో మంత్రి లోకేష్ కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛి అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో రాష్ట్ర అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. ఆయన వెంట చందు తదితరులున్నారు.

ప్రజాప్రతినిధులను విస్మరించారు

టిడిపి జడ్పిటిసి ఆగ్రహం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఐదు సంవత్సరాల వైసిపి అరాచక పాలనతో విసిగి వేసారిన ప్రజలు ప్రతిపక్షం కూడా లేకుండా చేశారని తెలుగుదేశం జడ్పిటిసిలు వెంకట సుబ్బారెడ్డి, అర్చన దేవి, తిరుమలయ్య అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు తగిన గుర్తింపు గౌరవం ఇవ్వలేదన్నారు. జిల్లా పరిషత్ సభ్యులకు వేతనాలు ఎంత ఇచ్చారనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ సమావేశాలు పెట్టడంతో ఉమ్మడి జిల్లాల నుండి స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కాలేకపోతున్నారని, తిరుపతి ఇతర ప్రాంతాల్లో అధికారుల సమీక్ష సమావేశాలు పెట్టాలని కోరారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరుకాకపోవడం సరికాదన్నారు. జిల్లా పరిషత్ స్థాయి సంఘ, సర్వసభ్య సమావేశాలను సక్రమంగా నిర్వహించి ప్రజాసమస్యల చర్చలు జరిగేలా జిల్లా పరిషత్ సీఈఓ, చైర్మన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

తిరుమలలో సైబర్ క్రైం టీం ఏర్పాటుకు పరిశీలన : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటి



తిరుమల శ్రీవారి భక్తులను మోసగిస్తున్న దళారులను కనిపెట్టి ఎప్పటికప్పుడు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా టీటీడీ ఈవో జె.శ్యామలరావు జిల్లా ఎస్పీని కోరారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో బుధవారం ఉదయం జిల్లా పోలీస్, టీటీడీ నిఘా, భద్రత విభాగం అధికారులతో ఈవో సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు అవసరమైన వసతి, దర్శనం, ఆర్జితసేవ టికెట్లకు సంబంధించి భక్తులను మోసగిస్తున్న అనేకమంది దళారులను ఉపేక్షించరాదన్నారు. వారిపై వెంట వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సివిఎస్ఓ వివరించిన ఆవశ్యకత మేరకు తిరుమలలో ఐటి అనుబంధంగా ఉన్న కేసులను సత్వరం పరిష్కరించేందుకు సైబర్ క్రైమ్ టీం ఏర్పాటు పరిశీలించవలసిందిగా సంబంధిత అధికారులకు ఈవో సూచించారు. అంతకుముందు పోలీస్ విభాగం వారు తిరుమలలో దర్శన దళారులకు సంబంధించి, ఆన్లైన్ ద్వారా, డిప్ సిస్టం ద్వారా, రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులు, దొంగతనం కేసులు, మద్యపానం, నకిలీ వెబ్సైట్లు, తదితర అంశాలకు సంబంధించిన కేసులు ఏఏ దశల్లో ఉన్నాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ మరో వారంలోపు ఈ కేసుల్లో ఉన్న దళారులకు చట్టపరంగా తగు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ అధికారులను కోరారు. అంతేకాకుండా ఇటువంటి కేసుల సత్వర పరిష్కారం కోసం టీటీడీ విజిలెన్స్, పోలీస్ విభాగాలు తరచూ సమావేశం కావాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్ఓ నరసింహ కిషోర్, తిరుమల అదనపు ఎస్పీ విమల కుమారి, డిఎస్పి శ్రీనివాస ఆచారి, టీటీడీ విజివో (విజిలెన్స్) గిరిధర్ పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆచూకీ తెలపండి..



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం గ్రామపంచాయతీలోగల తీర్థం గ్రామం నివసిస్తున్న ఇ.దేవక్క ఆదివారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని, ఆచూకి తెలిస్తే 63015 47661 నెంబర్‌కు తెలియజేయాలని కుటుంబ సభ్యులు కోరారు. ఆచూకి తెలిపిన వారికి తగిన బహుమతి ఉంటుందని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన షేక్ సందాని



ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితని బుధవారం చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ సందాని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జిల్లా పరిస్థితులను హోం మంత్రికి వివరించినట్లు తెలిపారు.

శ్రీనివాసులు రెడ్డికి ఘనసన్మానం



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు సింగల్ విండో పర్సన్ ఇన్చార్జి అధికారి ఎస్.శ్రీనివాసులు రెడ్డిని సింగల్ విండో అధికారులు, డిసిసిబి బ్రాంచ్ బ్యాంకు అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. జూన్ నెల 28వ తేదీన ఎస్.శ్రీనివాసులు రెడ్డి పర్సన్ ఇంచార్జ్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా సింగిల్ విండో సొసైటీ సీఈవో విజయ్ కుమార్ రెడ్డి, డిసిసిబి బ్రాంచ్ బ్యాంక్ మేనేజర్ మహేష్, సూపర్వైజర్ విజయ, సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ మునుస్వామి ఎస్.శ్రీనివాసులులను శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు.

హెల్మెట్ ధరించండి: ఎస్సై


ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాల ఎస్సై రాజకుల్లయప్ప తెలిపారు. బుధవారం మండలంలోని పిళ్ళారి కుప్పం క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్ దాని ప్రాముఖ్యతను వివరించారు. డ్రైవింగ్ లైసెన్సు, వాహన సంబంధిత కాగితాలను పరిశీలించారు. దొరై రాజ్ పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై ప్రజలతో చర్చ

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో గ్రామ సమస్యలపై ఎస్సై వెంకట నరసింహులు గ్రామస్తులతో మాట్లాడారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలు ఇతర చట్టపరమైన సమస్యల గురించి చర్చించి పరిష్కారం అయ్యే వాటిని అప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.



పెట్లూరులో సిపిఎం పోరాట ఫలితంగా జాయింట్ సర్వే

సర్వే రాయి కోసం వెతుకులాట

ప్రజాశక్తి వెంకటగిరి రూరల్

మూడు రోజులుగా మండల సర్వేయర్, ఫారెస్ట్ అధికారులు సర్వే రాయి కోసం వెతుకులాట ప్రారంభించారు. జంగాలపల్లి నుండి సిద్ధగుంట పెట్లూరు పంచాయతీ వరకు 12వ సర్వే నెంబరు రిజర్వ్ ఫారెస్ట్ భూమి లేక మీ భూమిలో ఉన్నట్లు మేత పోరంబోక తెలియడానికి గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకెళ్తే ...తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని పెట్లూరు గ్రామ సర్వేనెంబర్ 12 ను కనిపెట్టడానికి జాయింట్ సర్వే గత మూడు రోజులుగా మండల సర్వేయర్ సుప్రజ, ఫారెస్ట్ సిబ్బంది నిర్వహిస్తున్నారు. ఎంతోకాలంగా పేదవాళ్లు సాగు చేసుకుంటూ గుడిసెలు నిర్మించుకుని ఉంటున్న భూమి రిజర్వు ఫారెస్టుదంటూ కొంతకాలంగా పేదలపై దౌర్జన్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జాయింట్ సర్వే చేయాలని సిపిఎం డిమాండ్ చేయడంతో ఎట్టకేలకు సర్వేకు ఉపక్రమించారు. గూగుల్ మ్యాప్ ఇన్ పాయింట్స్ పెట్టుకుంటూ రాయి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. త్వరగా జాయింట్ సర్వే పూర్తి చేసి పేదలకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి చెంగయ్య విజ్ఞప్తి చేశారు. పేదలు జానెడు స్థలంలో సాగు చేసుకుంటూ, గుడిసెలు వేసుకుని దీర్ఘకాలికంగా ఉంటుంటే ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు ఏంటని ప్రశ్నించారు. పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.జాయింట్ సర్వేలో మండల లైసెన్స్ సర్వేయర్ చలపతి, సిపిఎం నాయకులు రమణయ్య, ఎర్రయ్య పాల్గొన్నారు.

గ్యాస్ ఏజన్సీల వద్ద బారులు తీరుతున్న జనం



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: గ్యాస్ పుస్తకాలను తీసుకెళ్లి ఈకేవైసీ చేసుకోవడానికి వినియోగదారులు ఏజన్సీల వద్ద బారులు తీరుతున్నారు. వెలుగు పథకంలో ఉన్నవారికే మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారన్న ప్రచారం ఊపందుకోవడంతో ఇండేన్ గ్యాస్ ఏజన్సీ ముందు వినియోగదారులు క్యూకడుతున్నారు. కొన్ని గంటల పాటు వేచి ఉండి మరీ ఈకేవైసీ చేసుకొని వస్తున్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

నేటి నుంచి అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ వాణిశ్రీదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మూడు అంగన్వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని 1.రామరాజపురం, 2.చంద్రశేఖరపురం. మినీ అంగన్‌వాడి మొగిలి అంగన్‌వాడి కార్యకర్తలు ఎంపికకు నాలుగో తేదీ నుండి 19వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారు ఆ ఊరి కోడలు అయి ఉండాలని, పదవ తరగతి పాసై ఉండాలని తెలిపారు. దరఖాస్తులు ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సమర్పించాలని ఆసక్తిగల మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే థామస్



ప్రజాశక్తి- కార్వేటినగరం: అనారోగ్యంతో యేసు మేరీ మృతి చెందడంతో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అల్లగుంటలో ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చురు. వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట పొన్న యుగంధర్, రాష్ట్ర రైతు కార్యదర్శి జనార్దన్‌రాజు, పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, రమేష్, రవి యాదవ్, పి.రాజా, రుక్కుబాబు ఉన్నారు.

అన్నదానానికి రూ.2.50లక్షల విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాదుకు చెందిన రామకష్ణరావు, మధుకుమారి అనే భక్తులు ఇటీవల రూ.2.50 లక్షలు విరాళంగా అందించారు. ఆలయ అధికారులు ఈ విరాళం స్వీకరించారు. దాతలకు కతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత లక్కమనేని మధుబాబు, ఏఈవో సతీష్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్



ఘటనపై డిఎంహెచ్ఒ విచారణ

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల పసికందు మృతిచెందిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. కార్వేటినగరం మండలం సురేంద్రనగరం గ్రామానికి చెందిన నరేష్ భార్య పూర్ణిమ రెండు రోజుల క్రితం పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరింది. మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ ఆరోగ్యంగా పుట్టిందని, అయితే వైద్యులు సక్రమంగా చూడకపోవడం వల్లనే ఊపిరితిత్తుల్లో పాలు చేరిపోయి మృతిచెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వైద్యులకు చెప్పినా రాత్రుల్లో స్పందించలేదని వాపోయారు. పసికందు మృతిపై జిల్లా వైద్యాధికారి శ్రీహరి, జిల్లా ఉప వైద్యాధికారి మురళీకృష్ణ స్పందిస్తూ తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారించి చర్యలు చేపడతామని తెలిపారు. కార్వేటినగరం తహశీల్దార్ పుష్పలత, డిప్యూటీ తహశీల్దార్ స్వరూప, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడుతో కలిసి ఆస్పత్రిలో పరిశీలించారు.

'నేను బడికి పోతా' బాటలో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - సోమల

మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య తన పాఠశాల సిబ్బందితో కలిసి ఇప్పటివరకు 6మందిని గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా సిఆర్పిలు ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు కూడా నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారిని పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకుని విద్యార్థులను పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం యూనిఫామ్ ఉచిత పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు అన్ని ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులు కూడా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్నారు.

ఎస్‌వి ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ ప్రవేశలకుఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : టీ టీ డి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్ వి ఆర్ట్స్ కాలేజీలో నాలుగు సంవత్సరాల హానర్స్ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు కోరడమైనది. ఓఏఎండిసి వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి. కాలేజీ కోడ్ 20132 బిఏ కోర్స్ లో ఇంగ్లీష్, తెలుగు, పాలిటిక్స్, ఎకనామిక్స్, హిస్టరీ, బీకామ్ జనరల్, బీకామ్ సి ఏ, బిఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఆక్వా కల్చర్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, సైకాలజీ, ఫిజిక్స్, మైక్రోబయాలజీ, బయో టెక్నాలజీ, ఎలక్ట్రానిక్, బోటనీ, జూవాలజీ, కెమిస్ట్రీ, డేటా సైన్స్ తదితర గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. మెరిట్ ఆధారంగా ఉచిత హాస్టల్ వసతి కల్పించబడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీ పద్మావతి జూనియర్ కళాశాలలో ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ

ప్రజాశక్తి - క్యాంపస్

2024 –25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి గాను శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రవేశాల ప్రక్రియలో భాగంగా అన్ని గ్రూపుల్లో కాలేజ్, హాస్టల్ సీట్లు పూర్తిస్థాయిలో ముగిసినవని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరి పత్రికా ప్రకటనలో వెలువరించారు. మొదటి మూడు విడతల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ప్రాతిపదికన నిర్వహించి, తదుపరి మిగిలిన కళాశాల సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా, ముందుగా తిరుపతి స్థానిక విద్యార్థులకు, స్థానికేతర విద్యార్థులకు పదవ తరగతి మార్కుల ప్రాధాన్యత ప్రాతిపదికన చేశారు. ప్రవేశాల ప్రక్రియకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు–2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ–మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్–522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ